ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

Bullet Edition

శనివారం 16 నవంబరు 2024 www.prajaaswaramdaily.com 4 pm

# ఏపీ సీఎం చంద్రబాబు సోదరుడి మృతి

## గుండె సంబంధిత సమస్యలతో ఆస్పత్రిలో చేరిక
## చికిత్సపొందుతూ తుదిశ్వాస



హైదరాబాద్: ఏపీ సీఎం చంద్రబాబునాయుడి సోదరుడు, సినీ నటుడు నారా రోహిత్ తండ్రి రామ్మూర్తి నాయుడు మృతి చెందారు. గుండె సంబంధిత సమస్యలతో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆయన చికిత్స పొందుతూ శనివారం మధ్యాహ్నం తుదిశ్వాస విడిచారు. 1994లో టీడీపీ నుంచి చంద్రగిరి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రామ్మూర్తి నాయుడికి భార్య ఇందిర, కుమారులు నారా రోహిత్, గిరీశ్ ఉన్నారు. చిన్నాన్న ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్న మంత్రి నారా లోకేశ్ తన కార్యక్రమాలను రద్దు చేసుకొని ఇవాళ ఉదయమే హైదరాబాద్ చేరుకున్నారు. న్యూఢిల్లీ పర్యటనలో ఉన్న చంద్రబాబు మరికాసేపట్లో తిరుగుపయనం కానున్నారు.

## సీఎం రేవంత్
# వాహనం తనిఖీ

### మహారాష్ట్రలో బహిరంగ సభకు వెళ్తుండగా..



ముంబై : మహారాష్ట్ర ఎన్నికల ప్రచారసభకు వెళ్తున్న సీఎం రేవంత్ రెడ్డి వాహనాన్ని మహారాష్ట్ర పోలీసులు తనిఖీ చేశారు. మహారాష్ట్ర లోని చంద్రపూర్ లో ఎన్నికల ప్రచారంలో తెలంగాణ సీఎం రేవంత్ పాల్గొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా చంద్రపూర్ బహిరంగ సభకు వెళ్తున్న క్రమంలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. సీఎం, ఆయన సిబ్బంది వారికి పూర్తిగా సహకరించారు.

# 2 గంటల పాటు విచారణ

## మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ స్టేట్ మెంట్ రికార్డు



హైదరాబాద్ : ఫోన్ ట్యాంపింగ్ కేసులో హాజరైన కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ విచారణ ముగిసింది. రెండు గంటల పాటు విచారించిన అధికారులు ఆయన స్టేట్మెంట్ రికార్డు చేశారు. మాజీ పోలీస్ అధికారి తిరుపతన్నకు తాను ఇచ్చిన రెండు ఫోన్ నెంబర్లు ట్యాపింగ్ అయ్యాయని వివరణ ఇవ్వాలని నోటీసులు ఇచ్చారని జైపాల్ యాదవ్ చెప్పారు. ఓ వివాదం విషయమై తిరుపతన్నను కలిశానన్నారు. తామందరం ఒకే సామాజిక వర్గానికి చెందిన వారం కావడంతో కుటుంబ వివాదాన్ని ఇద్దరం, కుల పెద్దలు పరిష్కరించామన్నారు. ఇది రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదన్నారు. విచారణ ముగిశాక జూబ్లీహిల్స్ పీఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే వెళ్లిపోయారు.

## త్వరలో లగచర్లలో
# ఎస్సీ, ఎస్టీ కమిషన్ పర్యటన

### కమిషన్ చైర్మన్ వెంకటయ్య వెల్లడి
### ఆయన్ను కలిసిన బాధితులు, బీఆర్ఎస్ నేతలు
### పోలీసులపై అట్రాసిటీ కేసు పెట్టాలని ప్రవీణ్ కుమార్ డిమాండ్

హైదరాబాద్: లగచర్ల బాధితులు, బీఆర్ఎస్ నేతలు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులను కలిశారు. పోలీసుల దాడి పై బాధితులు ఫిర్యాదు చేశారు. జరిగిన ఘటనను కమిషన్ కు వివరించారు. ఘటన బాధాకరమని ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య అన్నారు. ఆ ప్రాంతంలో పర్యటిస్తామన్నారు. చట్టప్రకారం నిందితులపై చర్యలు ఉంటాయని తెలిపారు. ఎస్సీ ఎస్టీ కమిషన్ వారు లగచర్లలో పర్యటించాలని బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కోరారు. దాడి చేసిన పోలీసులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టాలన్నారు. కమిషన్ సభ్యులు జైలులో ఉన్నవారి బాధలను వినాలన్నారు.





## జస్టిస్ అమర్నాథ్ గౌడ్ ...
# అరుదైన రికార్డు




### 92 వేల కేసుల పరిష్కారం
### యూకే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు
### తెలంగాణ గవర్నర్ చేతులమీదుగా పురస్కారం

హైదరాబాద్ : జస్టిస్ అమర్ నాథ్ గౌడ్ అరుదైన రికార్డు సొంతం చేసుకున్నారు. అత్యధిక కేసులను పరిష్కరించిన న్యాయమూర్తిగా యూకే వండర్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నారు. 2017 నుంచి ఇప్పటి వరకు 92 వేల కేసులను పరిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ చేతులమీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. జస్టిస్ అమర్నాథ్ గౌడ్ హైదరాబాద్ వాసి. న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్న క్రమంలోనే 2017లో సుప్రీం కోర్టు కొలిజీఎం.. ఆయన్ను తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా నియమించింది. తర్వాత త్రిపుర హైకోర్టుకు బదిలీ అయ్యారు. తన బెంచ్లో ఎప్పటికప్పుడు పెండింగ్ లో లేకుండా కేసులను పరిష్కరిస్తానని అమర్నాథ్ అన్నారు.

## ఒక్క రోజు కాదు..
# 3 నెలలు ఉండండి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మూసీ నిద్రపై పీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్
### బీఆర్ఎస్ కు నూకలు చెల్లాయి
### పార్టీ నేతలు ఇష్టారీతిన మాట్లాడుతున్నారని ఆగ్రహం

వరంగల్ : బీఆర్ఎస్ కు నూకలు చెల్లాయని, ఆ పార్టీ నేతలు ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారని పీసీసీ చీఫ్ మ హేశ్ గౌడ్ మండిపడ్డారు. బీఆర్ఎస్ పదేళ్లలో చేయలేని అభివృద్ధిని తాము ఏడాదిలోనే చేశామని అన్నారు. అభివృద్ధి పై లెక్కలతో సహా చర్చకు సిద్ధమన్నారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేద్దామన్నారు. మూసి వద్ద కిషన్ రెడ్డి ఒక్క రోజు నిద్ర చేస్తే ఏం తెలుస్తుంది అని అన్నారు. ప్రజల అటెన్షన్ డైవర్ట్ చేయడానికే నిద్ర కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. ఒక్క రోజు కార్యక్రమంలో ఒరిగేదేమీ ఉండదన్నారు. మూడు నెలలు అక్కడే ఉండండి అన్నారు.

